క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత, క్యాలెండర్ అందజేత

నెల్లూరు(బృందావనం): రామూర్తినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందుజ్ఞాన వేదిక నెల్లూరు, పొదలకూరు, దుత్తలూరు కమిటీల నిర్వాహకులు ఆదివారం కలిశారు. త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్, భగవద్గీత గ్రంథాలను అందజేశారు.

జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడికి సన్మానం



నెల్లూరు(బారకాసు): నెల్లూరు వచ్చిన హీరో సుమన్‌ను నగరంలోని మినర్వాగ్రాండ్‌లో ప్రముఖ న్యాయవాది, జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దాసరి ప్రసాద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దాసరిని సుమన్ శాలువాతో సత్కరించారు. జనతా ఫౌండేషన్‌ను స్థాపించి మిత్రుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపట్టడంపై దాసరిని అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుల మానవత్వం



నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికులు మానవత్వం చాటారు. వేసవిలో ఆకలి, దప్పికలతో అల్లాడుతున్న నగర శివారు ప్రాంతాల్లోని వానరాలకు ఆదివారం అరటిపండ్లు, కాయగూరలు, తాగునీరు అందించి మూగజీవాలపై తమ ప్రేమను చూపారు.

వీఎస్‌యూ అధ్యాపకుడికి యువ ఆచార్య అవార్డు



నెల్లూరు(అర్బన్): విక్రమసింహపురి విశ్వవిద్యాలయం అధ్యాపకుడు బీ వెంకటసుబ్బారెడ్డికి యువ ఆచార్య అవార్డు లభించింది. విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్రైనో విజన్ సంస్థ భారత్ ఎడ్యుకేషన్ ఎక్సెలెన్స్ అవార్డు–2024 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బారెడ్డికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఆల్‌ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కోఆర్డినేటర్ బుద్ధదేవ్ చంద్రశేఖర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పీవీడీ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. గత 14 ఏళ్లుగా సంఘ సంక్షేమ కృషి విభాగం ద్వారా విద్యార్థులతో కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించడం, సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యం చేయడం, కరోనా సమయంలో ప్రజలకు అవగాహన, సహాయక కార్యక్రమాలు చేపట్టడం, గ్రామీణ ప్రజల సమస్యలపై పరిశోధనా పత్రాలు సమర్పించడాన్ని గుర్తించి అవార్డును అందజేసినట్లు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

భార్గవరామ్‌కు బీఈఈఏ అవార్డు



నెల్లూరు(అర్బన్): నగరానికి చెందిన ఉచ్చి భార్గవరామ్‌కు భారత్ ఎడ్యుకేషన్ ఎక్సెలెన్స్ అవార్డు(బీఈఈఏ) లభించింది. విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బ్రైనో విజన్ సంస్థ భారత్ ఎడ్యుకేషన్ ఎక్సెలెన్స్ అవార్డ్స్–2024 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రెండు వేల మందికి ఉపాధి కల్పించినందుకు గానూ అవార్డును అందజేసినట్లు భార్గవ్‌రామ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఆదివారం జరిగింది. నెల్లూరు నగరంలోని వేదాయపాళెం ప్రాంతానికి చెందిన రాజేష్ పని నిమిత్తం బైక్‌పై నిడిగుంటపాళెం వెళ్తుండగా, సర్వేపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నెల్లూరుకు త రలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'గత ఐదేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారు. ఆయన్ని మళ్లీ ఆశీర్వదిస్తే వచ్చే ఐదేళ్లలో మరింత మెరుగ్గా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతారు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తెలిపారు. నగరంలోని 53వ డివిజన్‌లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్‌తో కలిసి ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ నగరంలో ఏమి చేశారో చెప్పుకుని తిరగలేని దుస్థితిలో ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల పార్టీ అని చెప్పారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ గడపగడపకు సంక్షేమ ఫలాలు అందజేశారని తెలిపారు. ఆయనకు మళ్లీ సీఎంగా అవకాశం కల్పిస్తే మీకు అభివృద్ధి, సంక్షేమం అందుతాయన్నారు. స్థానిక కార్పొరేటర్ ప్రలోభాలకు లొంగి మన పార్టీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలోకి వెళ్లారని మండిపడ్డారు. డబ్బులతో రాజకీయం చేయాలని చూస్తున్న టీడీపీ అభ్యర్థులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పెన్నా తీరంలోని కాలనీల ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించే వరకూ విశ్రమించబోమని హామీ ఇచ్చారు. గిరిజన కాలనీల రూపురేఖలు మారుస్తామన్నారు. జిల్లాకు నెల్లూరు నగరం రైలుకు ఇంజిన్ వంటిదన్నారు. ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 53వ డివిజన్‌లోని ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా రూ.40.14 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. 53,54 వార్డుల పరిధిలో పెన్నా నది ముంపు నుంచి రక్షణకు రూ.110 కోట్లతో రిటెయినింగ్ వాల్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. రూ.43 లక్షలతో వారధి సెంటర్ రోడ్డు పూర్తి చేశామని చెప్పారు. బుడగజంగాల ఇళ్లకు రూ.10 లక్షలతో విద్యుత్ సరఫరా కల్పించామన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు అందించి రూ.1.5 కోట్లతో గృహాల నిర్మాణం చేపట్టామని చెప్పారు. వార్డులోని ఆలయాలను రూ. 2 లక్షలతో అభివృద్ధి చేశామని వివరించారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి

వెంకటేశ్వరపురం నుంచి గాంధీ గిరిజన కాలనీకి అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. గిరిజన కాలనీలో పది పడకల ఆస్పత్రి ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. పెన్నా నది కట్టపై రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. అండర్ డ్రైనేజీ కోసం మాజీ మంత్రి పీ నారాయణ ప్రోద్బలంతో ధ్వంసం చేసిన రోడ్లను పునర్నిర్మిస్తామని తెలిపారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ తనకు, విజయసాయిరెడ్డికి అండగా నిలుస్తున్న ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని ప్రకటించిన నాటి నుంచి పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం వచ్చిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడినైన తనకు ఒక అవకాశం కల్పించారన్నారు. నెల్లూరు సిటీ ప్రజలకు సేవ చేసుకునే భాగ్యాన్ని తనకు కల్పించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి , బాగీ రమణ, కాలువ బాలశంకరరెడ్డి, వెంగళ్‌రెడ్డి ఎస్ఎంసీ కోఆప్షన్ మెంబర్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞతతో ఆలోచించి ఓటేయండి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఓటేయాలని, ప్రజలకు నిజంగా ఎవరు మేలు చేశారో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు పేరు చెబితే గుర్తుకొచ్చే పథకం ఒక్కటి లేదన్నారు. ప్రజాసంక్షేమానికి నిరంతరం పాటుపడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగిన తనయుడిలా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు చెప్పే అబద్ధాలను నమ్మకుండా విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. రూరల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించిన కేవీఆర్ శ్రీనివాసులురెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. మేయర్ స్రవంతి, నాయకులు లంకా రామశివారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు మల్లు సుధాకర్‌రెడ్డి, బిరదవోలు శ్రీనివాసులురెడ్డి, 19వ డివిజన్ నాయకులు, ఇన్‌చార్జులు పచ్చ రవి, వారాల లక్ష్మీనారాయణ, జల్లి కుమార్, కొండేటి శివారెడ్డి, పుట్టా విజయకుమార్‌రెడ్డి, దేవుళ్ల స్వరూప్‌రెడ్డి, కొండేటి రఘురామిరెడ్డి, కే సుకుమార్‌రెడ్డి, నెల్లూరు శ్రీనివాసులునాయుడు, సుధాకర్‌రెడ్డి, వంశీ, మాజీ కార్పొరేటర్ అనిత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తూ..

- 54వ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో పాదయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



పాదయాత్రను ప్రారంభిస్తున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, నెల్లూరు, నరసరావుపేట ఎంపీలుగా విజయసాయిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్ విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియామొజీర్ ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. 54వ డివిజన్ నుంచి బారాషహీద్ దర్గా వరకు చేపట్టిన ఈ పాదయాత్రను వెంకటేశ్వరపురం ఫ్లయిఓవర్ వంతెన వద్ద పార్టీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, తదితరులతో కలిసి ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ప్రారంభించారు. పెన్నావంతెన మీదుగా శెట్టిగుంటరోడ్డు, ఆత్మకూరుబస్టాండ్, వీఆర్సీసెంటర్, కేవీఆర్ పెట్రోలు బంక్ మీదుగా బారాషహీద్ దర్గా వరకు పాదయాత్ర సాగింది. అనంతరం దర్గాలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. పాతచెక్‌పోస్టు వద్ద 5వ డివిజన్ కార్పొరేటర్ ఓబిలిరవిచంద్ర, శెట్టిగుంటరోడ్డు వద్ద 6వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మద్దినేని శ్రీధర్, ఏబీఎం కాంపౌండ్ వద్ద 51వ డివిజన్ ఇన్‌చార్జి కాయల సురేష్, గాంధీబొమ్మ వద్ద 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్, వీఆర్సీసెంటర్ వద్ద 44వ డివిజన్ కార్పొరేటర్ నీలి రాఘవ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. 54వ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిది అనైతిక కలయిక



పార్టీలో చేరిన వారితో కలిసి మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 'టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఒక అనైతిక కలయిక.ఈ కూటమికి ఒక భావజాలం అంటూ ఏమి లేదని, తమ రాజకీయ అవసరాల కోసం ఒక్కటయ్యాయని వైఎస్సార్ సీసీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి విమర్శించారు. జనసేన జిల్లా జనరల్ సెక్రటరీ ప్రవీణ్, జిల్లా బీజేపీ, జనసేన సమన్వయకర్త శ్రీకాంత్ తమ అనుచరులతో కలిసి ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రామ్మూర్తినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ విజయసాయిరెడ్డి పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్‌తో కలిసి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులు పార్టీలో చేరుతున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. జనసేన పార్టీకి రాజకీయ అధికారం దక్కదని, మనుగడ సాధ్యం కాదని భావించి నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నారన్నారు. జిల్లాలో జనసేన పూర్తిగా ఖాళీ అవుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన సౌత్‌మోపూరు వాసులతో ఆదాల

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గం సౌత్‌మోపూరుకు చెందిన 200 మంది ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మినీబైపాస్‌రోడ్డులోని తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పీ కోటేశ్వర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివసునీల్‌రెడ్డి, సౌత్‌మోపూరు నాయకులు పచ్చిపాల సతీష్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరుకు చెందిన 60 కుటుంబాలు బీబీజాన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. 25 డివిజన్ పరిశీలకులు కోటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి సహకారంతో పార్టీలో చేరిన వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముంతాజ్, కవిత, రసూల్, రియాజ్, ఫరీద్, ఆయేషా, బుజ్జమ్మ,, షేక్ నూసిరాహ, షేక్ మస్తాన్, రఫీ, ఖాదర్‌బీ, ఫాతిమా, అనసూయమ, వీరాచార్యులు, మాబానీ, షాహీదా, నూరున్నీషా, తదితరులు ఉన్నారు.
- 24వ డివిజన్ కనుపర్తిపాడుకు చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ నేత మలిరెడ్డి కోటారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిని ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాగూరు, రమణయ్య, శ్రీనివాసులు, సురేంద్ర, హరి, శేఖర్, సాయి, రాజేష్, హరినాథ్, సన్నీ, హరిత, తదితరులు ఉన్నారు.

బాకీ ఇవ్వలేదని యువకుడిపై దాడి

నెల్లూరు సిటీ: బాకీ చెల్లించలేదని యువకుడిపై ముగ్గురు దాడికి పాల్పడిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు..కొత్తకాలువ సెంటర్‌లో నాగేంద్రబాబు వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ ప్రాంతానికి చెందిన కిరణ్ వెల్డింగ్ పనులు చేయించుకుని కొంత నగదు బాకీ పెట్టాడు. మరోసారి పనులు చేయించుకుని నగదు ఇవ్వలేదు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య బాకీ విషయమై గొడవ జరిగింది. కిరణ్ తన ఇద్దరి స్నేహితులతో కలిసి కొత్త కాలువ సెంటర్‌లోని నాగేంద్రబాబు ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డాడు. దీనిపై కోర్టు ఆదేశాలతో ఆదివారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చలివేంద్రాల ఏర్పాటు

నెల్లూరు(బృందావనం): పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జెడ్పీవాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు ఆకాష్, విద్యావతి, వెంకటస్వామి, నాగమణి, శ్రీనివాసరావు, అరుణ, మమత పుట్టినరోజును పురస్కరించుకుని చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అల్పాహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెలంచర్ల భాస్కరరెడ్డి, కోశాధికారి చెంచయ్య, ఉపాధ్యక్షులు ఎమ్వీ కృష్ణయ్య, సీఎల్ ప్రసాద్, బాల సుబ్రహ్మణ్యం, విమలమ్మ, మేరీ బ్లెస్సింగ్టన్, సుజన, సావిత్రమ్మ, హరిసుధ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



డాక్టర్ ప్రతిభాభారతికి సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం ప్రతిభాభారతి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వాకర్స్‌కు పలు రకాల వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిభాభారతిని ఘనంగా సన్మానించారు.వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి నసీర్‌అహ్మద్, కోశాధికారి ఎస్ సుబ్బారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ టెక్కెమిట్ట విద్యుత్ ఫీడర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కెమిట్ట, ఎర్రకట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

నెల్లూరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో



అల్లీపురంలో ప్రచారం చేస్తున్న జయవర్ధన్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు అభివృద్ధికి తన భర్త వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పక నెరవేరుస్తారని సునంద విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 11వ డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ గోతం అరుణ, పార్టీ నాయకులు బాలకృష్ణతో కలిసి ఆమె ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని తాళ్లపూడి తన భర్త స్వగ్రామమని, సొంత జిల్లాకు సేవచేసుకునే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో నెల్లూరు అభివృద్ధికి ఎంపీగా విజయసాయిరెడ్డిని, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్ అహ్మద్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, మహిళా నేతలు అపూర్వ, కర్తం జ్యోతి, వెంకటాచలం హిమబిందు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

నెల్లూరు సిటీ: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆదాల హిమబిందు కోరారు. ఆదివారం ఆమె తన తండ్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా 1వ డివిజన్‌లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న గడప గడపకు సంక్షేమ ఫలాలను అందించారని తెలిపారు. తన తండ్రి రూరల్ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టాక ఏడాది కాలంలో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. రూరల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో తన తండ్రిని రూరల్ ఎమ్మెల్యేగా, నెల్లూరు ఎంపీ విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. 1వ డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, నాయకులు కాకుటూరు లక్ష్మీసునంద, పాశం శ్రీనివాస్, వేలూరు శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, హరితారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్, నాపా సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, మౌలా, ముంగమూరు భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి మే 13న జరిగే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ నాయకుడు పొట్లూరి జయవర్ధన్ కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్, అల్లీపురంలో ఆదివారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఫ్యాన్ గుర్తుపై ఓటేసి రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 12వ డివిజన్ నాయకులు ప్రసన్నకుమార్‌రెడ్డి, బాలచంద్ర, విశ్వనాథ్, ఖాజా, సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



శబరి శ్రీరామక్షేత్రంలో శేష వాహన సేవ



చంద్రప్రభ వాహనంపై వేణుగోపాలస్వామి



సంతపేట ఆంజనేయస్వామి మందిరంలో..



త్యాగరాజస్వామి మందిరంలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రధాన ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం దేవతామూర్తులకు విశేష పూజలు, వాహన సేవలు నిర్వహించారు. దేవతామూర్తులు విశేషాలకారాల్లో భక్తులను అనుగ్రహించారు.

- సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం గిన్నెబిక్ష, రాత్రి గంధర్వ వాహన సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా బచ్చు రామకృష్ణ, వాకిచర్ల గోవిందయ్య వ్యవహరించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో ఉదయం సింహ వాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా పెసల జగదీష్, దుత్తలూరు అమరలింగేశ్వరరావు, డీ సుదర్శనరావు, డీ వేంకటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో ఉదయం మోహిని (గిన్నెబిక్ష) అలంకారోత్సవం, రాత్రి గరుడ వాహన సేవ జరిపారు. ఉభయకర్తలుగా మెంటా వెంకటేశ్వర్లు, మెంటా వెంకటకిరణ్‌కుమార్, పీ శ్రీనివాసరావు కుటుంబసభ్యులు వ్యవహరించారు.
- మూలాపేట వేణుగోపాలస్వామి మందిరంలో ఉదయం యాళి వాహన సేవ, రాత్రి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా పుట్టా నరేంద్రరెడ్డి, లక్ష్మి, ఆర్కాట్ తారాచంద్, రజనీ దంపతులు, ఇస్కా విజయకుమార్‌రెడ్డి వ్యవహరించారు.
- వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో కోదండరామస్వామికి ఉదయం తిరుమంజన సేవ, ఊంజల్‌సేవ, రాత్రి తిరుచ్చి సేవ నిర్వహించారు.
- రామ్‌నగర్ శబరి శ్రీరామక్షేత్రంలో ఆదివారం రాత్రి శేష వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణం, హోమం, బలిహరణ పూజలు జరిపారు.

ఘనంగా భగవాన్ మహావీర్ జయంతి



భగవాన్ మహావీర్‌జైన్ పల్లకి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని మండపాలవీధిలోని జైన మందిరంలో భగవాన్ మహావీర్ జయంతి వేడుకలను జైన శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సక్రస్తవ్ మహాభిషేకంలో భాగంగా జైన మతగురువులు గచ్ఛాధిపతి ఉదయ్‌ప్రభ సురీశ్వర్ శిష్యబృందం నీలమ ప్రభశ్రీజీ పర్యవేక్షణలో సాధ్వీజీలు భగవాన్ మహావీర్‌కు క్షీరాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భగవాన్ మహావీర్ ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పల్లకిపై కొలువుదీర్చి సుమతి శ్రేయాన్స్ జైన్ డోలక్ బృందం ఆధ్వర్యంలో నగరోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో సోనల్‌జైన్, ప్రీతిజైన్ తమ మధురగాన సంగీతంతో ప్రణమిల్లారు. నగరంలోని జైన మతస్తులు కుటుంబ సమేతంగా పాల్గొని తమ భక్తిప్రపత్తులను చాటారు. ఈ కార్యక్రమాలను నెల్లూరు జైన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భేర్‌మల్ జైన్, అరవింద్‌జైన్, కిషోర్‌జైన్ తదితరులు పర్యవేక్షించారు.